# నేడు ఎల్1 కక్ష్యలోకి ఆదిత్య

- ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి
- జేఎన్‌టీయూహెచ్ 12వ స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరు
- సోమనాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన జేఎన్‌టీయూ



జేఎన్‌టీయూలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి. చిత్రంలో ప్రొఫెసర్ గోవర్ధన్, రిజిస్ట్రార్ మంజూర్‌హుస్సేన్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ): సూర్యుడి రహస్యాల గుట్టు విప్పేందుకు ప్రయోగించిన ఆదిత్య ఎల్1 శాటిలైట్‌ను శనివారం సాయంత్రం 4 గంటలకు లాగ్రాంజ్ పాయింట్ 1 కక్ష్యలోకి ప్రవేశపెడుతామని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ వెల్లడించారు. హైదరాబాద్ జేఎన్‌టీయూలో శుక్రవారం నిర్వహించిన 12వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమనాథ్‌కు జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. అనంతరం సోమనాథ్ మీడియాతో మాట్లాడుతూ.. సొంత సాంకేతిక పరిజ్ఞానంతో ప్రయోగించిన ఆదిత్య ఎల్1 విజయవంతంగా దూసుకుపోతున్నదని పేర్కొన్నారు. ఈ నెల లేదా ఫిబ్రవరి మొదటి వారంలో వాతావరణానికి సంబంధించిన ఉపగ్రహాన్ని కూడా ప్రయోగించనున్నట్టు వెల్లడించారు. గగన్‌యాన్ ప్రయోగం కోసం కూడా సన్నాహాలు కొనసాగుతున్నాయని, 2024 గగన్‌యాన్ సంవత్సరం కాబోతుందని చెప్పారు. అంతరిక్ష రంగంలో విజయాల నేపథ్యంలో ఇప్పుడు ప్రపంచమే భారత్ వైపు చూస్తున్నదని సోమ్‌నాథ్ అన్నారు. జీవితంలో అపజయాలు, ఒడిదొడుకులు సహజమని, అపజయాల నుంచే పాఠాలు నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. నేటికాలం ఆలోచనలకు అనుగుణంగా యూనివర్సిటీల్లో కూడా కొత్త కోర్సులు తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జేఎన్‌టీయూకు టెక్నాలజీ సాయం అందించడంలో ఇస్రో ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. జేఎన్‌టీయూ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్‌తో కలిసి వీసీ నరసింహారెడ్డి, ప్రొఫెసర్ గోవర్ధన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్ ఆధ్వర్యంలో దాదాపు 88,226 మందికి పట్టాలు ప్రదానం చేశారు. యూజీ, పీజీ, పీహెచ్‌డీలలో 54 మందికి బంగారు పతకాలు ప్రదానం చేశారు. 142 మందికి పీహెచ్‌డీ పట్టాలు అందచేశారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై హాజరు కాలేదు. అయితే ఆమె మొబైల్ సందేశం ద్వారా విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ఫ్యూయల్ సెల్ పరీక్ష విజయవంతం

బెంగళూరు, జనవరి 5: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఫ్యూయల్ సెల్‌ను విజయవంతంగా పరీక్షించింది. జనవరి 1న చేసిన ఈ ప్రయోగంలో భాగంగా.. రసాయన చర్య జరిపిన ఫ్యుయల్ సెల్ కేవలం నీటినే బై ప్రొడక్ట్‌గా విడుదల చేసిందని ఇస్రో వెల్లడించింది. హైడ్రోజన్, ఆక్సిజన్ నుంచి రసాయన చర్య జరిపి 180 వాట్ల శక్తిని విడుదల చేసిందని తెలిపింది. భవిష్యత్తులో అంతరిక్ష కేంద్రాల్లో వాడే విద్యుత్తు ఉత్పత్తి కోసం అభివృద్ధి చేసిన ఈ ఫ్యూయెల్ సెల్ పనితీరుకు సంబంధించిన డాటాను సేకరించామని, దానితో పూర్తిస్థాయి పనితీరును విశ్లేషిస్తామని వెల్లడించింది.

**చవకైన బ్యాటరీ**

అత్యంత సామర్థ్యం, అతి చవకైన బ్యాటరీని కూడా ఇస్రో పరీక్షించింది. భవిష్యత్తు మిషన్ల కోసం దీన్ని అభివృద్ధి చేశామని, ప్రస్తుతం ఉపయోగిస్తున్న లిథియం-అయాన్ బ్యాటరీలకన్నా తక్కువ బరువు, తక్కువ ధర అని వెల్లడించింది. ఇవి 10 ఏహెచ్ సిలికాన్ గ్రాఫైట్ ఆనోడ్ ఆధారిత బ్యాటరీలని వివరించింది.

## మెడికల్ కాలేజీల్లో పోస్ట్-డాక్టొరల్ ఫెలోషిప్ కోర్సులు

- తొలిసారి ప్రవేశపెట్టిన నేషనల్ మెడికల్ కమిషన్
- పరిశోధనలను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యం

న్యూఢిల్లీ, జనవరి 5: వైద్య రంగంలో పరిశోధనలను ప్రోత్సహించడంతోపాటు క్లినికల్ నైపుణ్యాలను పెంపొందించేందుకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) తొలిసారి తన నియంత్రణలో ఉన్న మెడికల్ కాలేజీల్లో పోస్ట్-డాక్టొరల్ ఫెలోషిప్ కోర్సులను ప్రవేశపెట్టింది. ఇప్పటివరకు వైద్య విద్యా సంస్థలే సొంతగా ఇలాంటి కోర్సులను రూపొందించి, ఆమోదించేవి. ఈ నేపథ్యంలో ఎన్‌ఎంసీ ఇటీవల 'పోస్ట్-గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్-2023'ను నోటిఫై చేసింది. ఈ నిబంధనల ప్రకారం ఏదైనా మెడికల్ కాలేజీలో పీజీ కోర్సును లేదా సీట్లను ప్రారంభించేందుకు అనుమతించిన తర్వాత ఆ కోర్సు గుర్తింపు పొందినట్టుగా పరిగణిస్తారు. దీంతో పోస్టుగ్రాడ్యుయేట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన తర్వాత డిగ్రీని రిజిస్టర్ చేసుకోవడంలో విద్యార్థులకు ఎదురవుతున్న అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎన్‌ఎంసీ ఆధ్వర్యంలోని పోస్టు-గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్ ఓజా వివరించారు. పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ (సవరణ) నిబంధనలు-2018 స్థానంలో నోటిఫై చేసిన కొత్త నిబంధనల ప్రకారం.. పీజీ అడ్మిషన్ల కోసం ప్రతిపాదించిన నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్స్ట్) అమలులోకి వచ్చే వరకు ప్రస్తుత నీట్-పీజీ పరీక్ష కొనసాగుతుంది.

## అంబేద్కర్, బుద్ధుడూ దైవాంశ సంభూతులే!

**వారి పేరున ప్రమాణం తప్పు కాదు: కర్ణాటక హైకోర్టు**



బెంగళూరు, జనవరి 5: రాజ్యాంగం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం కాకుండా కొందరు వ్యక్తుల పేరిట శాసనసభలో ప్రమాణ స్వీకారం చేయడంలోని పవిత్రతను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను కర్ణాటక హైకోర్టు కొట్టివేసింది. అంబేద్కర్, బసవేశ్వర, బుద్ధుడు వంటి వారిని దైవాంశ సంభూతులుగా పరిగణిస్తారని, రాజ్యాంగంలోని మూడో షెడ్యూల్‌లో పేర్కొన్న 'గాడ్' అనే ఇంగ్లిష్ పదం కూడా ఇంచుమించు దీనినే సూచిస్తుందని ధర్మాసనం పేర్కొన్నది. అంతేకాకుండా దేవుడి పేరు ప్రస్తావించనక్కర్లేకుండా ప్రమాణం చేసేందుకు కూడా రాజ్యాంగం అనుమతి ఉందని తెలిపారు.




